# గ్లామర్

విశ్వనాధరావు కాలేజీ ప్రిన్సిపల్. ఆయనంటే కాలేజీలో పిల్లలకే కాదు, వాళ్ల తల్లిదండ్రులక్కూడా హడలే.

ఫ్యాషన్లూ, పైలా పచ్చీసులూ, పిచ్చివేషాలూ అతనికి గిట్టవు. అటువంటి వేషాలేసే స్టూడెంట్స్‌నితన రూంకి పిలిచి పూనకం వచ్చిన గొరిల్లాలా మారిపోతాడు. ఇంకా వినకపోతే వాళ్లను కన్నవాళ్లని పిలిపించి ముక్కు నేలను వేసి రాసి బాబోయ్ అనిపించిగాని నిద్రపోడు.

ఆంగ్లభాషోపన్యాసకుడిగా విశ్వనాధరావుకి ఆంగ్లభాషమీద ఆంగ్లేయుడికి మించిన కమాండ్ ఉంది. ఆయన ఫైనల్ ఇయర్‌కెళ్లి 'ఓడ్స్ టు సైకి' పొయిట్రీ చెప్పి తవ ఆఫీస్ రూంకి తిరిగొస్తూంటే, వరండాలో తుల్య ఎదురైంది.

తుల్య హిస్టరీ లెక్చరర్. చాలా చరిత్రలమీద పరిశోధన చేసిందిగాని పరిశోధనా వ్యాసాన్ని మాత్రం పదిలంగా తన అనుభవాల్లోనే పదిలపరుచుకుంది.

తుల్య విశ్వనాధరావు జీవిత రసతుల్య. అంటే అతనికి అర్ధాంగి. అచ్చ తెలుగులో పెళ్లాం.

తనో స్కానర్ మిషన్లా ఆమెను చూశేడు, ఎందుకలా చూశేడు, పాతిక సంవత్సరాలనుంచి కాపురం చేస్తున్న భార్యేకదా? అదే కాలేజీలో ఇంకా అయిదుగురు ఆడ లెక్చరర్లు అడవిలోంచి ఎగి రొచ్చి వాలిన నెమలిపిట్టల్లా తనముందు తిరుగుతున్నా, వాళ్లలో ఈమెకున్నంత ఆకర్షణ ఏది?

అతణ్ణి తుల్య గమనించింది. కాని గమనించనట్టే తనక్లాస్‌కి వెళ్తోంది.

అతను బలవంతంగా రెండడుగులు ముందుకేశాడు. మనస్సు నీటిలో మొసలయ్యింది.

పక్కరూంలో తెలుగు లెక్చరర్ ఓ ప్రబంధ కన్యను రొమాంటిక్ వర్ణనలతో క్లాస్ టాపు లేపేస్తున్నాడు. నూనూగు మీసాల కుర్రాళ్ల తలలు బద్దలగొట్టేస్తున్నాడు శృంగారమనే సుత్తితో.

బలిసిన నల్లత్రాచులా మిసమిసలాడుతూ, నాట్యంచేస్తున్న ఆమె జడ, ఆ జడలో ఆమె శరీరచ్ఛాయలో ఉన్న వవనవలాడే గులాబీ, మరి కొంచెం కిందికి చూస్తే గుండ్రని నడుమూ, నడకలో ముగ్ధ మనోహర లాస్యం— అతనికే వెర్రెత్తిపోతూంది ఓ క్లియోపాత్రా తన ముందు కొచ్చి వాలినట్టు!

విశ్వనాధరావు రూంకెలా వెళ్లాడో తనకే తెలియదు, రైజయ్యిన బీ.పీతో మూడీగా కూర్చుండి పోయాడు.

"సార్! మీ కోసమెవరో వచ్చారు" అన్నాడు ప్యూన్ పాపారావొచ్చి.

అతను చాలాసేపు బ్లాంక్ అయ్యాడు.

కడకి తనకు తానే కొంత స్టెబిలిటీని తెచ్చుకుని బయట వెయిట్ చేస్తున్న వాళ్లని రమ్మని పిలిపించాడు.

ముగ్గురు యువకులూ, ఓ యువతీ లోపకొచ్చేరు. ఆ యువతికి వయస్సు ముప్పైకావొచ్చు. కాని నలభై వచ్చేసి నలిపి పిండిపారేసినట్టుంది. కాస్త్తీ మేకప్ వాడింది. స్లీవ్‌లెస్ బ్లౌజ్ లోంచి ఆమె తన అందాల్ని బయటకు కనిపించేందుకు చేసిన ప్రయత్నం వెగటుగా ఉంది. అస్సామీలా చిన్ని ముక్కు, మిజోలకుండేటట్టు పెద్ద నుదురు, ఆఫ్రికన్‌లా పెద్ద పెదాలు ఈమెకూ తుల్యకూ ఎంత విభేదం రూపంలో అనుకున్నాడు విశ్వనాథరావు భార్య అందాల్ని తలుచుకుంటూ.

"మేం మన టౌన్లో బ్యూటీ క్లినిక్ ప్రారంభించాలనుకుంటున్నాం. అందుకు మీ శ్రీమతి తుల్యగారిని గౌరవాధ్యక్షురాలిగా ఉండాలని కోరుకుంటున్నాం" అందులో ఓ యువకుడు పొరపళ్లు బయట పెట్టి అడిగేడు.

అక్కడికి అనేకమంది తమ దెయ్యాల్లాంటి భార్యల్ని తెచ్చి వదిలి పోతారు మేకప్‌వల్ల రాత్రికి వాళ్ల ముఖాలు చూడడానికి వీలవుతుందని. ఈ మగాళ్లే తమ భార్యల్లో లేని అందాలు మరెవరిలోనో వెదుక్కొని, ఆమెను ఊహించుకుంటూ అసలుభార్యతో సంసారం చేసే ఎద్యుకేటెడ్ బీస్ట్స్. తుల్యపైనే వాళ్లతోడేళ్ల చూపులన్నీ— కడకి సెక్సువల్ డ్రాకులాలు కూడా వీళ్లే!

నో— ఐ హేట్ ఇట్— యూ ఆర్ ఆల్ హిపోక్రెటెడ్ సోఫిస్టికేటెడ్ హ్యూమన్ డాగ్స్ — అంటూ గట్టిగా అరవబోయాడు.

అతని కుడిచేతిలో పేపర్‌వెయిట్ బిగుసుకుంది అతని కోపమంతా దానిమీద కేంద్రీకరించి, మెల్లిగా మనిషయ్యాడు.

"మీరెవరైనా సినీయాక్ట్రెస్‌ని చూసుకోవలసింది" అన్నాడు అతను పొళ్లుమంటతో.

"మొత్తం సినీఫీల్డ్ వెదికినా తుల్యగారి లాంటి గ్లామరస్ లేడీ యెక్కడున్నారండీ? మా ఆడవాళ్లమే ఆమె అవ్వతో పడిపోతుంటాము" అంది ఆ యువతి వంకర్లు తిరిగిపోతూ.

కాలేజీలో కుర్రాళ్లు అనేకసార్లు గోడలమీద రాసేరు (తుల్య—ఎవ్వర్‌గ్రీన్ బ్యూటీ) అని.

కింగ్‌లియర్ తనలో ఆవేశించాడు. డాక్టర్ ఫాస్టస్ నాటకంలో క్షుద్ర పాత్ర మెఫస్టాలిస్ అతనికి అండగా నిలిచాడు. విశ్వనాథరావు వాళ్లకేదో కఠినంగా చెప్పి పంపించివేశాడు.

*** **** *** ***

ఇరవై అయిదేళ్లు వెనక్కి వెళ్లాయి అతని ఆలోచనలు. అపుడు తుల్య తనక్లాస్‌మేట్. ఆమె అందానికి అంతా సమ్మోహితులయ్యేవారు.

హిస్టరీ లెక్చరర్, ఆ ముసలి పీనుగ సహితం ఎంత ఆశగా చూసేవాడు ఆమెవంక. ఇపుడు అర్థమవుతుంది అందంలో గల మహిమ. కీట్స్ పొయిట్రీ అంతా ఆడదాని గురించీ, అందాన్ని గురించే కదా!

ఎవ్వరికీ దక్కని సౌందర్య గని తనకు దక్కింది. దాని కోసం ఎంత శ్రమించాడు! ఎంత త్యాగం చేసుకున్నాడు!

*** *** *** ***

మెల్లగా యింటికెళ్లేడు విశ్వనాథరావు. అతని ఆలోచనలకి పైపై ఫేవరొచ్చింది.

కాసిని మెతుకులు తిని పక్షవాతం వచ్చినవాడల్లే మంచంలో పడ్డాడు.

ఆమె అప్సరసలా తయారయ్యి బెడ్‌రూం కొచ్చింది.

అతనామెను వోరకంట చూశేడు.

ఉదయం సాంఘిక బాధ్యతగల సమాజంలో ఓ స్త్రీ:కాలేజీలో విజ్ఞానం పంచే సరస్వతి.

సింహామూర్తి

# ఎవరికీ దక్కని సౌందర్య గని అతనికే దక్కింది! ఆ సౌందర్యం కోసం ఎంతగా శ్రమించాడు, ఎంత త్యాగం చేశాడో???

ఇపుడు సంసార స్వర్గంలో సకల ఐహిక సుఖాలకూ ఆద్యంతాలు చూపించే రంభ!

అతను అసహ్యంగా అటుగా తిరిగి పడుకున్నాడు.

తుల్యవెళ్లి భర్త మీద చెయివేసింది ఆకాశం మీంచి దిగి వచ్చిన ఫెయిరీలా. అతనిలో రెస్పాన్స్ బ్రేక్ అయ్యింది. అతని గడ్డం మీద వేలు వేసి



ఇటు తిప్పి ఏమిటి పంగతన్నట్టు నక్షత్రాలు నిండిన కళ్లతో వలపుగా ప్రశ్నించింది. అతనామె చెయ్యి తీసేసి ముభావంగా ఉండిపోయాడు.

ఆమె గాఢంగా నిట్టూర్చి మరో పక్కమీద పడుకుంది. రసికత్వం, శృంగారం ఆ రాత్రి నీళ్లుక్కారిపోయాయి.

ఉదయం అతను టిఫిన్ తింటూ ధుమధుమలాడుతున్నాడుమాట్లాడకపోతే బావుండదని "ఏంటండీ అలాగున్నారు?" అడిగింది తుల్య.

"ముసలితనం ముదిరేకొద్దీ మేకప్ కూడా పెరుగుతుంది" అన్నాడు కడకు తెగించి.

ఆ మాట ఆమె మీద బాంబులా బ్లాస్టయ్యింది.

'బ్లడీ అన్‌కల్చర్డ్‌ఫోగ్, మొత్తం మీద మవ్వా మొగాడివే అనిపించుకున్నావ్" అనుకుంది లోలోన.

రెండ్రోజులు గడిచాయి.

ఓ రోజున "ఏ మేకప్ సామాగ్రికి నెలసరి ఖర్చెంత?" ప్రశ్నించాడు.

"మీరు తాగే సిగరెట్ల ఖర్చులో ఒన్‌బై ఎయిత్, అది కూడా నా సంపాదనలోదే."

చాచి లెంపకాయ కొట్టినట్టుందామె జవాబు.

"పొద్దున్నే ఆస్ట్రింగ్ లాగటం, వ్యాయామం చెయ్యడం యింకా యెందుకు చంటిపిల్లలా— ఎవరైనా చూస్తే నవ్వుతారు" "ఆరోగ్యం కాపాడుకోవడానికి వయోపరిమితి లేదు. ఆరోగ్యమే అందం. ప్రతి వ్యక్తికీ గాలీ, వెలుగూ, నీరూ యెంత అవసరమో ఇదీ అంతే. కావాలంటే మీరు కూడా నాతోపాటు వ్యాయామం చెయ్యండి" అంది తుల్య.

ఇద్దరి మధ్యా గొడవ లేచి పెట్రోలు మంటలా భగ్గుమంది. "తుల్యా! యింత వయసొచ్చినా నీకీ మేకప్పేమిటి— నువ్వేమన్నా సినీయాక్ట్రెస్‌వా— లేక క్లబ్బుల్లో దొరికే హైక్లాస్ కాల్‌గాల్‌వా?—" అన్నాడు వైల్డ్‌గా.

బీరువాలో ఉన్న కీట్స్ పొయిట్రీ టెస్ట్ తీసుకుని బయటకు నడవబోతూంటే—

"మిస్టర్ విశ్వనాథ్‌రావ్, స్టే దేర్" గర్జించిందామె.

గన్ పేలి తూటా గుండెల్లోంచి దూసుకుపోయినట్టనిపించిందతనికి.

"ఇరవై అయిదు సంవత్సరాల క్రితం నా వెనక పిచ్చెక్కి మీరు యెందుకు పడ్డారో చెప్పగలరా?— ఎన్ని వందల ఉత్తరాలు నా అందాన్ని వర్ణిస్తూ రాశారో గుర్తుందా? కాని అప్పట్లో అనేక వందల అమ్మాయిలు కూడా మీతో చదువుతూ ఉండేవారు..వాళ్లందరికీ ఇలా ఉత్తరాలు రాసి ప్రేమంటూ రేయింబగళ్లు పరుగెత్తారా? నా కోసం మీరు మీ కుటుంబాన్ని సహితం త్యజించి వచ్చారంటే నాలో మీరు చూసిందేమిటి? కొంత అందం, మరికొంత గ్లామర్, అంతే కదూ?

"అందం వయస్సుతోపాటు తరుగుతుంది. అది సాధ్యమైనంతవరకూ నిలుపుకోలేకపోతే మీ మగబుద్ధి కుక్కబుద్ధిలా మారే ప్రమాదం ఉంది.

"చిరకాలం మన సంసారం గ్లామరస్‌గా ఉండాలంటే కేవలం హృదయంలో ఉండే ప్రేమొక్కటే చాలదు. నా గ్లామర్ కూడా కాపాడుకునే అవసరముందని నాకు తెలుసు. ఈ సూత్రం స్త్రీలకే కాదు, పురుషులకి కూడా వర్తిస్తుందని వేరే చెప్పవవసరం లేదనుకుంటాను".

●